ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025 5
అనంతపురం





జెఎన్‌టియు భవనం

బాలయ్యా.. తల్లీబిడ్డల కష్టాలు చూడయ్యా..!

◆ అసౌకర్యాల నడుమ మాతాశిశు ఆసుపత్రి
◆ భవన నిర్మాణంలో నిబంధనలు పాటించని కాంట్రాక్టర్
◆ వేసవిలో పనిచేయని ఏసీలు

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తరహాలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిత్యం పేర్కొంటున్న మాటలు ఇవి. అయితే మాతా శిశు ఆసుపత్రి పైన నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ సెంటర్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించక పోవడంతో తల్లీబిడ్డలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. మాతా శిశు ఆసుపత్రిలో సుమారు రూ. 25 లక్షలు విలువ చేసే 35 ఏసీలు ఉన్నప్పటికీ తల్లీబిడ్డలకు ఉక్కపోత కష్టాలు తప్పడం లేదు. అష్ట కష్టాలు పడుతున్న తల్లీబిడ్డల అగచాట్లను స్థానిక ఎమ్మెల్యే బాలయ్య ఒక్క సారి చూడాలని అసుపత్రి రోగులు కోరుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లాస్థాయి హోదా ఉంది. దీంతోపాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసుపత్రిని అన్ని విధాల అభివద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. దీనికోసం తన సొంత నిధులతో ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను సైతం అందించారు. హిందూపురం ఆసుపత్రికి గత సంవత్సరం నూతనంగా కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్ ను మంజూరు చేసింది. భవనాలు నిర్మాణం చేయడానికి ఆసుపత్రి ఆవరణంలో అనువైన స్థలం లేకపోవడంతో మాత శిశు ఆసుపత్రి పైన నిర్మాణం చేయడానికి అనుమతులు తీసుకొని పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి మాతా శిశు ఆసుపత్రికి కష్టాలు ప్రారంభమయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తుండడం ఆసుపత్రికి కష్టాలు తెచ్చిపెట్టింది. మాతాశిశు ఆసుపత్రిలో ఉన్న ఏసీలపై నిర్మాణ పనులకు సంబంధించిన సిమెంట్, మట్టి, చిన్న చిన్న ఇటుకలు పడి పాడయ్యాయి. పనులు చేసే సమయంలో వాటి రక్షణకు కనీస చర్యలు చేపట్టక పోవడంతో లక్షల రూపాయల విలువ చేసే ఏసీలు అన్ని చెడిపోయాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో వేసవిలో తల్లీబిడ్డలు ఉక్కుపోత కష్టాలు పడుతున్నారు. జిల్లాలోనే ఏ ఆసుపత్రిలో లేని సౌకర్యాలు హిందూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మాతా శిశు విభాగంలో కల్పించారు. ఈ ఆసుపత్రి లో అప్పుడే పుట్టిన శిశువుకు సంబంధించిన ప్రత్యేక వార్డుతో పాటు వివిధ వార్డులను ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు విలువ చేసే వైద్య పరికరాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో హిందూపురంతో పాటు పక్కన ఉన్న మడకశిర, పెనుగొండ నియోజకవర్గాల పరిధిలో ఉన్న గ్రామాలతో పాటు పక్కన ఉన్న కర్నాటక రాష్ట్రం నుంచి ఎంతో మంది అనారోగ్యంగా ఉన్న వారి చిన్నారులను తీసుకొని వచ్చి వైద్య సేవలు పొంది, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తిరిగి వెళుతున్నారు. ఎంతో మంది తల్లీబిడ్డలకు పునర్జన్మనిస్తున్న మాతా శిశు ఆసుపత్రి నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ వల్ల అనారోగ్యం పాలైంది. వెంటనే చర్యలు తీసుకోవాల్సిన స్థానిక ఎమ్మేల్యే నందమూరి బాలకృష్ణ అటు వైపు చూడడం లేదు. ఇక జిల్లా అసుపత్రికి చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ మాత్రం ఎప్పుడైన ఒక సారి అలా వచ్చి ఇలా వెళ్లి పోతున్నారు. గతంలో సైతం అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చి ఓపి నిర్వహణపై పలు మార్పులు చేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే నేటికి అవి అమలు కాలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని ఉక్కుపోతతో అల్లాడుతున్న తల్లీబిడ్డల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



అసుపత్రిలో పని చేయని ఏసీ

కాంట్రాక్టర్‌కు వివరించాం



మాతాశిశు అసుపత్రి పైన నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ చేపట్టిన పనుల్లో భాగంగా మాతాశిశు అసుపత్రిలో ఉన్నా ఎసిలు మరమ్మతులకు గురయ్యాయి. దీనికి సంబందించి ఎసీలను వెంటనే మరమ్మతు చేయించాలని సంబందిత కాంట్రాక్టర్‌కు వివరించాము. ఆయన స్పందించకుంటే ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

లింగన్న,
మెడికల్ సూపరింటెండెంట్



మాత శిశు అసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏసీలకు బయట ఏర్పాటు చేసిన ఫ్యాన్లపై మట్టి పెల్లలు పడిన దృశ్యం

17న జెఎన్‌టియు స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం మే 17 వతేదీన నిర్వహించనున్నట్లు జెఎన్‌టియు వీసీ ఆచార్య హెచ్. సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు ఆయన రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కూడా స్నాత కోత్సవంలో పాల్గొనాలని తాము ప్రత్యక్షంగా కలసి ఆహ్వానిస్తామని వీసీ చెప్పారు. జెఎన్‌టియు 14 వ స్నాతకోత్సం సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో 2023–24 సంవత్సరంలో బీటెక్, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు,పిహెచ్‌డి పూర్తి చేసిన పరిశోధక విద్యా ర్థులకు డాక్టరేట్ పట్టాలు, ఉత్తమ మార్కులు సాధించిన 40మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనునట్లు తెలిపారు. స్నాతకోత్సవం నిర్వహణకు ప్రత్యేక కమిటీలను నియమించినట్లు వివరించారు.



పాదయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

గార్లదిన్నె-కూడేరు రోడ్డు నిర్మాణం చేపట్టాలి

పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక మీదుగా కూడేరు బైపాస్ రోడ్డు వరకూ నూతన రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణాలపై హామీ ఇస్తూ పబ్బం గడుపుతున్నాయన్నారు. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోడ్డు నిర్మాణం గురించి ఆలోచించలేదన్నారు. వర్షం వస్తే ప్రయాణం చాలా కష్టంగా ఉంటుందన్నారు. అనంతరం తహశీల్దార్ వీరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, మండల కమిటీ సభ్యులు మర్తాడు వలి, చాకలి కిష్టయ్య, నాగార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, జయ్యమ్మ, కొత్తపల్లి రాము, పెనకచెర్ల వెంకటరాముడు, రమిజా, ఆదినారాయణ, రవితేజ, నాగమ్మ, మహబూబ్ పీరా, మంజుల, హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాంఛూఫెర్రర్‌తో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఆర్డీటీని కాపాడుకుందాం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజల ఆశాకిరణమైన ఆర్డీటీని కాపాడుకుందామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం అనంతపురంలో ఆర్డీటీ పోగ్రాం డైరక్టర్ మాంఛూఫెర్రర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. కోట్లాదిమంది ప్రజలకు సేవ చేసిన ఆర్డీటీ కష్టాలకు గురి కావడం బాధగా ఉందన్నారు. ఆర్డీటీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం చేయడానికి కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. అంతకుమునుపు ఆయన స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

6న ఏపీ ఈసెట్ పరీక్షలు



వివరాలు వెల్లడిస్తున్న జెఎన్‌టియు వీసీ

35,187 మంది దరఖాస్తు
ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో పరీక్షలు
ఏపీలో 109 పరీక్ష కేంద్రాలు హైదరాబాద్ లో ఒకటి
ఏపీ ఈసెట్ చైర్మన్, జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శన రావు

ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏపీ ఈసెట్– 2025 పరీక్ష మే ఆరవ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీ ఈసెట్ చైర్మన్, అనంతపురం జెఎన్‌టియు వీసీ ఆచార్య హెచ్ సుదర్శన్ రావు తెలిపారు. మంగళవారం అనంతపురం జేఎన్టీయూ పరిపాలన భవనంలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో ఏపీ ఈసెట్ కన్వీనర్ ఆచార్య దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏపీ ఈసెట్‌పై విలేకరుల సమావేశం నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ సుదర్శన్ రావు మాట్లాడారు. మే 6న రెండు సెషన్లలో ఎపి ఈసెట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం సెషన్ రెండు గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు. అనంతపురం జేఎన్టీయూ ఏపీ ఈసెట్ పరీక్షలను పదోసారి ఎటువంటి సమస్య లేకుండా నిర్వహిస్తోందని చెప్పారు. 2025 సంవత్సరం ఈసెట్ పరీక్షకు 35,187 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో అత్యధికంగా 11,029 దరఖాస్తులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు, 9,416 ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌కు, 4757 మెకానిక్ మెకానికల్ ఇంజనీరింగ్‌కు, 3,050 సివిల్ ఇంజనీరింగ్‌కు, 327, 54 కెమికల్ ఇంజనీరింగ్, 38 ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ కు, 71 మైనింగ్ ఇంజనీరింగ్, 45 బీఎస్సీ మ్యాథమెటిక్స్, 3 సిరామిక్ ఇంజనీరింగ్‌కు, 1 బీఎస్సీ మ్యాథమెటిక్స్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం మొత్తం 110 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఏపీలో 109, హైదరాబాద్ కేంద్రంగా ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను మే ఒకటవ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్‌లో ఎటువంటి పొరపాట్లు ఉన్న వెంటనే ఏపీ ఈసెట్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఏపీ సెట్ పరీక్ష రాసే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించడం జరగదని ఇది గమనించాలని కోరారు. కేవలం హాల్ టికెట్, ఏపీ ఈసెట్ దరఖాస్తు ఫారం, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఐడి కార్డ్ మాత్రమే తీసుకురావాలని అన్నారు. పరీక్షలు ఒఎంఆర్ షీట్ పద్ధతిలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, ఏపీ ఈసెట్ కో కన్వీనర్, అడ్వైజర్ ఆచార్య టిఆర్ భానుమూర్తి, శ్రీధర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నూర్ మహమ్మద్, పిఆర్ఒ ఓంప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

ప్రజాశక్తి - గుత్తి

గుత్తి రైల్వే జంక్షన్ నార్త్ క్యాబిన్ వైపు ఉన్న పంపు హౌస్ సమీపంలో నిలబడి ఉన్న రాయలసీమ ఎక్స్ ప్రెస్ (12794) రైలులో సోమవారం అర్థరాత్రి గుర్తుతెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. తెలంగాణలోని నిజామాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న రాయలసీమ ఎక్స్ ప్రెస్ రైలు సిగ్నల్ లేకపోవడంతో నార్త్ క్యాబిన్ వైపు నాలుగు కిలోమీటర్ల సమీపంలో నిలబడిపోయింది. ఇది గమనించిన దుండగులు రైలులోని బోగిల్లోకి చొరబడ్డారు. ప్రయాణికులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని గుత్తి జిఆర్ పి పోలీసులు తెలిపారు. బాధిత ప్రయాణికులు తిరుపతిలో జిఆర్ పి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో కూడా గుత్తి రైల్వే జంక్షన్ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 7 హిల్స్ ఎక్స్ ప్రెస్‌లో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. గుత్తి రైల్వే జంక్షన్ సమీపంలోని పెద్ద బ్రిడ్జి వద్ద, జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్స్ లేకపోవటంతో నిలబడిన రైళ్లలోకి చొరబడి దుండగులు దోపిడీకి పాల్పడ్డారు.దీంతో రైల్వే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సివిల్, జిఆర్పి, ఆర్పిఎఫ్ శాఖలు సంయుక్తంగా రైళ్లలో జరిగే దోపిడీలను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై జిఆర్పి పోలీసులు, ప్రత్యేక బృందాలు సంఘటన స్థలంతో పాటు వివిధ ప్రాంతాల్లో విచారణ చేపట్టారు.

రైతు సేవాకేంద్రాల సిబ్బంది రేషనలైజేషన్

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జిల్లాలోని 450 రైతు సేవాకేంద్రాల్లోని సిబ్బందిని సాగు విస్తీర్ణం అధారంగా రేషనలైజేషన్ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు. ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వారీగా వ్యవసాయ ఉద్యాన, పట్టు పరిశ్రమ సాగు చేసే విస్తీర్ణాల ఆధారంగా రేషన్‌నలేజేషన్ ఉంటుందన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 189 మంది ఉద్యాన సహాయకులు 123 మంది వ్యవసాయ సహాయకులు 9 మంది పట్టు పరిశ్రమ శాఖ సహాయకులు, ఎంపిఇఒలను పరిగణలకు తీసుకుని రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.



పారిశ్రామికవేత్తలతో సమావేశమైన కలెక్టర్ వినోద్‌కుమార్, విప్ కాలవ శ్రీనివాసులు

పరిశ్రమల స్వర్గధామం రాయదుర్గం

ఔత్సాహికులకు సహకరిస్తాం-విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పరిశ్రమల ఏర్పాటుకు రాయదుర్గం ఓ స్వర్గధామమని విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. కలెక్టర్ వినోదకుమార్ అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ అత్యంత వెనుకబడ్డ రాయదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడి ప్రజలు కూడా శాంత స్వభావులన్నారు. భూమి అందుబాటు ధరల్లో లభిస్తుందన్నారు. ముఖ్యంగా ముడి ఖనిజం, నీటికి ఎలాంటి ఢోకా లేదన్నారు. అవసరమైన కూలీలు అందుబాటులో ఉన్నారని, సాంకేతిక నైపుణ్యం కలిగిన వారి అవసరం ఉండాలంటే ఇక్కడి యువతకే ఆయా విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా అనువైన వాతావరణం, వసతులు ఉన్నాయన్నారు. పారిశ్రామిక వేత్తలు రాకపోకలకు బళ్లారి లోని విమానాశ్రయం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బళ్లారిలో ఇదివరకే పరిశ్రమలు నిర్వహిస్తున్న వారి తదుపరి విస్తరణకు రాయదుర్గాన్ని ఎంపిక చెసుకోవచ్చున్నారు.

ఆర్‌డిటికి అండగా మేమున్నాం

సిఎం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వాస్తవాలు తెలుపుతాం
ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌తో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)కు టిడిపి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆర్‌డిటి ప్రొగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌ను ఎమ్మెల్యే కలిసి ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరువు కోరల్లో చిక్కుకున్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు సేవలతో ఊపిరి పోసిన సంస్థ ఆర్‌డిటి అన్నారు. నేడు రాయలసీమ జిల్లాలతో పాటు వెనుకబడిన ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో కూడా విస్తరించి ప్రజలకు సేవ చేస్తున్న జాతీయ స్థాయిలో ఆదర్శవంతమైన సంస్థగా నిలిచిందన్నారు. అలాంటి సంస్థకు నేడు ఎఫ్‌సిఆర్‌ఎ నిలుపుదల చేయడం బాధాకరం అన్నారు. కోట్లాది మంది ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్‌డిటి సంస్థ గురించి సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు తెలుసన్నారు. అయినా కూడా జిల్లా ప్రజా ప్రతినిధులుగా తామంతా ముఖ్యమంత్రికి వివరించి ఆర్‌డిటి సేవలు, వాస్తవ పరిస్థితి, ప్రజల ఆకాంక్షలను వివరించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్‌డిటి అందిస్తున్న సేవా కార్యక్రమాల గురించి కేంద్రానికి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు సరిపూటి రమణ, తదితరులు పాల్గొన్నారు.



మాంఛూఫెర్రర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఎమ్మెల్యేను కలిసిన అఖిలపక్ష నాయకులు

ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ చేయించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను అఖిల పక్ష పార్టీల నేతలు ఆర్,బి అతిథిగృహంలో కలిసి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ చేయించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్‌డిటిని కాపాడుకుంటేనే జిల్లాకు రక్షణగా ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్‌డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతిసాహిత్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిసిసిఎ ఛైర్మన్ షకీల్ షఫీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సామాజిక కార్యకర్త డిస్కవరి అనిల్‌కుమార్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, మైనార్టీ నాయకుడు ఇశాక్, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, ఆసుపత్రి కమిటి సభ్యులు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు సరిపూటి రమణ, లక్ష్మీనరసింహ, శిరిసాల రాంబాబు, జెఎం.బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా వ్యవస్థలో మార్పు లేదు..

బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్

ప్రజాశక్తి-రాయదుర్గం



విలేకరులతో మాట్లాడుతున్న బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ వ్యవస్థలో ఏమాత్రం మార్పు లేదని భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. మంగళవారం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న వైసిపిని కాదని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పటికీ పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, బీసీలు ఇలా అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఈ ప్రభుత్వం కేవలం పబ్లిసిటీ ప్రాధాన్యత ఇస్తోంది కానీ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తికి నిధులు విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో సరికొత్త విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు గత ఎన్నికల ముందు భారత చైతన్య యోజన పార్టీ ఏర్పాటు అయింది అన్నారు. అయితే సమయం తక్కువగా ఉండటం వల్ల పార్టీని రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాత్మకంగా పూర్తి చేయలేదన్నారు. త్వరలోనే పార్టీని బలోపేతం చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రజలకు న్యాయంగా అందాల్సిన ప్రయోజనాలు చేకూర్చేందుకు పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో బిసివై పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి, నాయకులు తంద్రి గౌని శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ కట్టించుకుని రైతు రుణాలు రెన్యువల్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్


బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-శింగనమల
రైతులు బంగారాన్ని తాకట్టు పెట్టిన తీసుకున్న రుణాలను కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సలకంచెరువులో ఎస్‌బిఐ, తరిమెలలో ఎపిజి బ్యాంకుల మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భార్యల బంగారాన్ని తాకట్టు పెట్టి కష్టపడి పంటలు సాగు చేస్తున్నా తగిన ప్రతిఫలం దక్కడం లేదన్నారు. దీంతో అప్పులు, ఆత్మహత్యలే మిగులుతున్నాయన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి బంగారంపై తీసుకున్న రుణాలకు కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సుంకన్న, సూర్యప్రకాష్, సూరి, రామాంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు


దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రజాశక్తి-రాయదుర్గం
ఎపిఎస్ ఆర్టీసీ సంస్థలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయదుర్గం లో అసోసియేషన్ ఆర్టీసీ డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండవ రోజు కూడా కొనసాగాయి. అసోసియేషన్ డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు ఎంఎండి షఫీ, రీజినల్ జాయింట్ సెక్రటరీ ఎఎస్ నాయుడు ప్రారంభించారు. దీక్షల్లో ఆర్టీసీ ఉద్యోగులు జిలాన్, పి.సతీష్‌కుమార్, దూద్‌పీరా, రావు, చంద్రశేఖర్, రవికుమార్ నాయక్, మాలిక్‌బాషా, నారాయణ, ఆంజనేయులు, వెంకటేశులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేంత వరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిపో అసిస్టెంట్ సెక్రటరీ రమేష్, ప్రచార కార్యదర్శి నఫీజ్, సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, సీనియర్ నాయకులు జయప్రకాష్, రెడ్డి, మస్తాన్, వన్నూరుసాబ్, తిరుపాల్, రమణ, షబ్బీర్, ఎర్రిస్వామి, వంశీకృష్ణ ఎడిసి కెఎండి ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

భూసార పరీక్ష కేంద్రం ఎఒ శ్రీనాథ్‌రెడ్డి


రైతులకు భూసార పత్రాలు అందజేస్తున్న ఎఒ శ్రీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం
భూసార పరీక్షల చేయించి పోషక లోపాలు గుర్తించి సరిచేసుకుంటేనే అధిక దిగుబడులు సాధ్యమని భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం రాచనాపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో అనంతపురం మండల ఎఒ జె శశికళ అధ్యక్షతన భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలోని పోషక లోపాలను గుర్తించి అందుకు సరిపడా ఎరువులను వినియోగించినప్పుడే సాగు ఖర్చులు తగ్గి.. అధిక ఫలసాయం సాధించవచ్చన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం భూసార పరీక్షల పై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.రోషన్ జమీన్, సీఈవో ఆర్.శ్రీనివాసులు, ఎఇఒ మురళీకృష్ణ, విహెచ్ఎ శివశంకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మనిషి విలువను పెంచేది పుస్తకాలే..

ఎన్‌జిసిఎ రీజినల్ కోఆర్డినేటర్ కె.ఆనంద్‌భాస్కర్



మాట్లాడుతున్న ఎన్‌జిసిఎ రీజినల్ కోఆర్డినేటర్ కె.ఆనంద్‌భాస్కర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
మనిషి విలువను పెంచేది నగలు, ఆభరణాలు కాదని.. మంచి పుస్తకమని నేషనల్ గ్రీన్ కార్ప్ అనంతపురం రీజినల్ కో-ఆర్డినేటర్ కె.ఆనంద్ భాస్కర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పుస్తక వారోత్సవాల్లో భాగంగా 7వ రోజు హౌసింగ్ బోర్డులోని రాజీవ్‌చిల్డ్రన్స్ పార్క్‌లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని దిశానిర్దేశం చేసే అద్భుతమైన సాధనాలు పుస్తకాలు అన్నారు. కావున ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అర్జున్‌నాయక్, జెవివి రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జెవివి నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామిరెడ్డి, కె.వీరరాజు, నాయకులు విరూపాక్షి, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

'బాలాజీ'కి న్యాక్ ఎ గ్రేడ్ గుర్తింపు


కళాశాల అధ్యాపకులను అభినందిస్తున్న చైర్మన్ పల్లెకిషోర్, ట్రెజరర్ సింధూర

అనంతపురం : జిల్లాలోని ప్రముఖ బాలాజీ ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఎ గ్రేడ్‌ను లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ గౌరవం కళాశాల ఫ్యాకల్టీ, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, యాజమాన్య సహకారంతోనే సాధ్యమైందన్నారు. కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ బాలాజీ కళాశాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా మరింత భలంగా నిలిపే ఘట్టం అన్నారు. తమ లక్ష్యం విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే అన్నారు. కళాశాల ట్రెజరర్ పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ మనందరి కృషికి గుర్తింపు అన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం యాజమాన్యం అన్ని విధాలా సహకరిస్తుందని వివరించారు.

బాల్య వివాహాలు చేయొద్దు

బ్రహ్మసముద్రం : బాల్య వివాహాలు చేస్తే అనేక అనార్థాలకు దారితీస్తాయని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేరు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పిల్లలపల్లి గ్రామంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సామాజిక దురాచారం అన్నారు. బాల్య వివాహలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం నల్లక్క, ఆశా కార్యకర్తలు తిమ్మక్క, మల్లక్క, అనసూయ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

అనంతపురం కలెక్టరేట్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బృందా, రిటైర్డ్ ఎక్సైజ్ శాఖ డిఎస్పి శ్రీహరి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారం రెండో రోజు కార్యక్రమాల్లో వారు హాజరై పిల్లలకు గ్రంథాలయ సంస్థ సేవలు సద్వినిగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పర్సనాలిటీ డెవలప్మెంట్ గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఇంగ్లీష్ గ్రామర్, జీ.కే. కె గురించి వివరించారు. మహేష్ బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ గురించి వివరించారు. శ్రీ రాములు మోటివేషన్ గురించి వివరించారు. యోగా టీచర్ వెంకటేశప్ప యోగా గురించి పిల్లలకు ఇంట్రడక్షన్ క్లాస్ ఇచ్చారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : డొక్కా సీతమ్మ వర్థంతిని పురస్కరించుకుని సాయిట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పెద్దాసపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ నిత్యం తన ఇంటికి వచ్చేవారికి కడుపునిండా రుచికరమైన భోజనం అందించేదని గుర్తు చేశారు. అలాంటి డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని డిప్యూటీ పవన్‌కళ్యాణ ప్రతిపాదన మేరకు నారాయణ సేవ కార్యక్రమాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు బృందం రాఘవేంద్ర, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్దాం

విప్ కాలవ శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరీ మోగిద్దామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం రాయదుర్గంలోని సిద్ధివినాయక కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయి నుండి పార్టీ కమిటీలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి పదవులు అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వెనుకపడ్డ రాయదుర్గం ప్రాంతానికి చేయూత నిస్తున్నారన్నారు. మన పరిస్థితిని వివరిస్తూ ఏదైనా కోరితే కాదనకుండా మంజూరు చేస్తూన్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఏమి కోరుకొంటున్నారో, ఏది చేస్తే వారికి మేలు జరుగుతుందో గుర్తించి అందుకు అనుగుణంగా పని చేసుకుపోతున్నామన్నారు. ముఖ్యంగా రాయదుర్గంలో బాలికల జూనియర్ కళాశాల, వంద పడకల ఆస్పత్రి, బిటిపికి కృష్ణాజలాల తరలింపు, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి, పరిశ్రమల ఏర్పాటు, నాణ్యమైన విద్యుత్, తుంగభద్ర ఎగువకాలువ ఆధునీకరణ, ఆవులదట్ల బ్రాంచ్ కాలువ, రైల్వే బ్రిడ్జిల ఏర్పాటు, రహదారుల విస్తరణ, కొత్తగా తయారు రోడ్లు, గ్రామాల్లో సిమెంట్ రహదారులు ఇలా అనేక ప్రజామోదమైన పనులను చేపట్టామన్నారు. వినతిపత్రాలు సమర్పించి ఊరకే కూర్చొంటే పనులు జరగవన్నారు. సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులను పదేపదే కలిసి గుర్తు చేయటం వల్లనే సాధ్యం అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ వస్తోందన్నారు. అయితే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు మున్సిపల్ వార్డు సభ్యురాలు ప్రశాంతి, నాయకులు పురుషోత్తం, ఇనాయత్‌బాషా, హనుమంతు, తిప్పయ్య, తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
ప్రతి మహిళా పరిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని సాయినగర్ మొదటి క్రాస్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.2లక్షల మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 7వేల మందికి, అనంతపురం పార్లమెంట్ పరిధిలో 4వేల మందికి శిక్షణ ఇస్తున్నారన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 500 మందికి చొప్పున శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా అనంతపురంలో జనాభా దృష్ట్యా నగరంలో 1500 మందికి శిక్షణ ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే వెయ్యి మందికి అనుమతి ఇచ్చారన్నారు. ఇంకా ఎవరైనా శిక్షణ తీసుకోవాలనుకుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో 200 ఎలక్ట్రిక్ బైకులు, ఆటోలు ఇస్తున్నట్లు చెప్పారు. వీటి కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, కార్పొరేటర్ బాలాంజనేయులు, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నేత కమ్మూరు నాగరాజు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కొండన్న, మాజీ కార్పొరేటర్లు సరిపూటి రమణ, రాజారావు, సాయి నగర్ టిడిపి నాయకులు లక్ష్మీదేవి, బోయ శ్రీనివాసులు, తాహిర్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పిల్లలు, గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లు, చిన్న సైజు గుడ్లు, నాసిరకం చిక్కిలు సరఫరా చేస్తారా.. అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని రహమత్ నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. హాజరును తీసుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కుళ్లిన కోడి గుడ్లు, చిన్న సైజు గుడ్లు, చిక్కిల నాణ్యత లోపించాయని చూసి అసహనం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతారా అంటూ మండిపడ్డారు. పిల్లలు, బాలింతలు, గర్భిణీలు, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తుంటే కొందరు ఇలాంటి సరకులు సరఫరా చేసి చెడ్డపేరు తెస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు.

మున్సిపల్ డిఇఇ హేమచంద్రపై కౌన్సిలర్ల ఆగ్రహం


డిఇఇ హేమచంద్రపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గుత్తి
మున్సిపల్ డిఇఇ హేమచంద్ర నిర్లక్ష్యపు సమాధానాలతో మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలోని సభ మందిరంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిలర్లు షేక్ నజీర్, వాల్మీకి శివ, మార్తాడు హసీనా, వి.వరద, రమణ, వెంకటసుబ్బయ్య తమ సమస్యలను సమావేశం దష్టికి తెచ్చారు. తమకు తెలియకుండా మున్సిపల్ అధికారులు వార్డుల్లో పర్యటిస్తున్నారని తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ డిఇఇ హేమచంద్ర మీకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని కౌన్సిలర్లతో అన్నారు. దీంతో మూకుమ్మడిగా కౌన్సిలర్లు అందరూ ఆయన్ను నిలదీశారు. తాము రాజీనామాలు చేస్తామని అభివృద్ధి పనులకు మీరే సంతకాలు చేసుకుని బిల్లులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కమిషనర్ బి.జబ్బార్‌మియా కూడా డిఇఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఇఇ హేమచంద్ర తాను పొరపాటుగా అన్నానని క్షమాపణ చెప్పారు. ముందుగా పలువురు కౌన్సిలర్లు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సిఎస్ఐ చర్చి నుంచి గాంధీ కూడలి వరకు బిటి రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ షేక్ నజీర్ కోరారు. ఆ రహదారి పట్టణానికి ప్రధానంగా ఉందని అది గుంతల మాయం కావడంతో వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 7వ వార్డులో నూతనంగా బోర్ వేయాలని, మురుగు కాలవలు శుభ్రంగా చేయాలని కౌన్సిలర్ వి. వరదరాజులు అన్నారు. తమ వార్డులో మురుగు కాలువలు నిర్మించాలని కౌన్సిలర్ మార్తాడు హసీనా డిమాండ్ చేశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కౌన్సిలర్ వాల్మీకి శివ కోరారు. తురకపల్లి రోడ్డులో ధ్వంసం రహదారిని బాగు చేయాలని కౌన్సిలర్ రమణ అన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

'ఉపాధి' పనుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా పరిశీలించారు. ఇందులో భాగంగా చెర్లోపల్లిలో పశువుల నీటి తొట్టి, గోపరాజుపల్లిలో ఫారంపాండ్ పనులు, కమ్యూనిటీ సోక్‌ఫిట్ పని, పశువుల షెడ్, పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపిడి పుల్లారెడ్డి, ఎపిఒ నరేంద్ర, ఇసి అంజనాకుమార్, టిఎలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్టెలను త్వరగా పూర్తి చేయాలి : ఎంపిడిఒ

బెలుగుప్ప : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల నీటితొట్టెలను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రవినేపల్లి, బ్రాహ్మణపల్లి తండాలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు అనంతరం నిర్మాణంలో ఉన్న పశువుల నీటి తొట్లెలను పరిశీలించారు. అనంతరం శ్రీరంగాపురం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మురళీకృష్ణ, తిప్పేస్వామి, లక్ష్మణ్, సెక్రటరీ శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా ప్రజలకు ఆదర్శవంతమైన సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జె.గౌస్‌మొద్దీన్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ ఎంతో గొప్పదన్నారు. 56 సంవత్సరాల క్రితం జిల్లాలో ప్రారంభించి నేడు 7 జిల్లాల్లో సేవలు విస్తరించాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థను కాపాడుకోవడానికి సమిష్టిగా పోరాడుదామన్నారు. కేంద్ర ప్రభుత్వం పునర్ పరిశీలించి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతపురం : ఆర్‌డిటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డాక్టర్ కెఎస్ ఎఆర్ గఫూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ఛైర్మన్ కెఎస్ అబ్దుల్ రజాక్ గఫూర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభమైన ఆర్డీటీ సంస్థ పేదలకు అనేక సేవలు చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులను పునరుద్ధరణ చేయకపోవడం బాధాకరమన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ లెక్చరర్ భరత్‌బాబు, మేనేజర్ జిలాన్, క్లర్క్ సబ్బేర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి ఆర్డీటీని సంరక్షించాలని వినతిపత్రం అందజేశారు.

ఉరవకొండ : కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ఆర్డీటీ సంస్థను కాపాడుకుందామని ఎంఆర్‌పిఎస్, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ఎటిఎం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు బెంజిమెన్, చాబాల సర్పంచు జగదీష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఆర్డీటీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ పునరుద్ధరణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

గోపుర నిర్మాణానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని నాగులగుడ్డం ఎస్‌సి కాలనీలో సుంకులమ్మ దేవస్థానం గోపురం నిర్మాణానికి జనసేన పార్టీ మండలం అధ్యక్షులు తోట ఓబులేసు దంపతులు మంగళవారం రూ.2,516 ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఆలయంలో గంటకు ఏర్పాటుకు రూ.2వేలు అందజేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

శింగనమల : నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన సిఎం రిలీఫ్ చెక్కులను మంగళవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బాధితులకు అందజేవారు. ఈ కార్యక్రమంలో శింగనమల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ బోయ సత్యనారాయణ, అనిల్‌కుమార్, మాసూల్ చంద్రమోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ప్రచారం

పుట్లూరు : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని గరుగుచింతలపల్లిలో ప్రత్యేక్ డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్య నాణ్యతపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు విద్యాబోధనతోపాటు పరీక్షలపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, గణిత ఉపాధ్యాయులు ఉస్మాన్ పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభ

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నయక్కలూరి గ్రామంలో రీసర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజకుమార మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి వస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ నాగప్పనాయక్, మండల సర్వేయర్ రామ్‌మోహన్, విఆర్ఒ ప్రసాద్, గ్రామ సర్వేయర్లు సూరి, రాజేష్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ సెక్టార్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలను ప్రాథమిక పాఠశాలలలో చేర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మధుమాలిని, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

శింగనమల : మండల వ్యాప్తంగా పట్టాదారు పాసు పుస్తకం కలిగిన రైతులందరూ తప్పనిసరిగా 11 అంకెల రిజిస్ట్రేషన్ నమోదు వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలో 7,820 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా 3,262 మంది చేయించుకోవాల్సి ఉందన్నారు. వారందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

శాంతి ర్యాలీ

అనంతపురం కలెక్టరేట్ : జమ్మూ కాశ్మీర్ పహల్గాములో దాడి చేసిన ఉగ్రవాద దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ మంగళవారం 49వ డివిజన్ ఇందిరానగర్‌లో కాలనీవాసుల కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శివారెడ్డి, రాము, సావిత్రి, ముస్తఫా, చాంద్‌బాషా, మా బాషా, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, అవాజ్ వలీ, ప్రకాష్, చంద్రిక ,అశ్విని, యాసీన్ ,రహంతుల్లా, సిద్ధికి,ఇఃతియాజ్,హసీబ్,సాలెహ, ఖాసీం,రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పెహల్గాం ఉగ్రదాడులను నిరసిస్తూ మంగళవారం సాయంత్రం నార్పలలో ముస్లిములు స్థానిక జామియా మసీదు నుండి గాంధీ సర్కిల్ వరకు జాతీయ జెండాలు పట్టుకుని, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ముతవల్లి ఇక్బాల్ భాషా మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రతి భారతీయుడు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖాజీ ఫయాజ్‌బాషా, మౌలానాలు జక్రియ, మన్సూర్, ఫారుక్, రెహమాన్, ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

వ్యక్తి పై గృహహింస కేసు

ప్రజాశక్తి - యల్లనూరు
మండల పరిధిలోని అచ్యుతపురం గ్రామానికి చెందిన గడ్డం కంభగీరయ్య పై గృహ హింస కేసు నమోదు చేసినట్లు పోలీసులుతెలిపారు. గ్రామానికి చెందిన కంభగీరయ్య తన భార్య భవానిని వేధిస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శింగనమల : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని పోతురాజుకాలువ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... పెద్దపప్పూరు మండల కేంద్రానికి చెందిన వెంకటరామిరెడ్డి (40) టివి మెకానిట్ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. దీంతో ఎపిఆర్‌జెసి పరీక్ష రాయించేందుకు బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న కోచింగ్ సెంటర్‌లో శిక్షణకు చేర్పించాడు. ఇందులో భాగంగానే కుమారుడిని కోచింగ్ సెంటర్‌లో వదిలి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా పోతురాజుకాలువ సమీపంలోని రాగానే తాడిపత్రి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో హెల్మెట్‌లోనే తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుత్తి : రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్- 2 లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు గుత్తి రైల్వే స్టేషన్ లో అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ ఓ వ్యక్తి గత కొన్ని రోజులుగా ఉండేవాడు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య లో ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో మంగళవారం అతడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు షర్టు, మాసిపోయిన గడ్డం తో ఉన్నట్టు ఎవరైనా అతడిని గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని గుత్తి జీఆర్పీ ఎస్ఐ నాగప్ప కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామంలో హరిజన యల్లప్ప (46) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. గలగల్లు గ్రామం నుంచి 15ఏళ్ల క్రితం వలస వచ్చిన యల్లప్ప ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. ఈనేపథ్యంలో అప్పులు ఎలా తీర్చాలని మదనపడిన యల్లప్ప సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యల్లనూరు మండలంలో మరో వ్యక్తి..

యల్లనూరు :మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామానికి చెందిన గంగాధర్ (50) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గంగాధర్ కు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నారు. వికలాంగుడైన గంగాధర్ ఇటీవల కుమార్తెకు వివాహం చేశాడు. పెళ్లికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధన పడుతూ విషం మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సాయంతో పులివెందుల ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.